క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తిరుపాలు

నందికొట్కూరు: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే జరిమానా తప్పదని బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు హెచ్చరించారు. మంగళవారం నేషనల్ హైవేపై ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ప్రమాదాలపై వాహనాదారులకు అవగాహన కల్పించారు. అతివేగంగా బైక్ నడపడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లైసెన్స్ లేకుండా, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని ఆయన సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై మార్కాపురానికి చెందిన శ్వేత నాట్య అకాడమీ వారి భక్తి రంజని కార్యక్రమం, వనపర్తికి చెందిన వనపర్తి సత్యం స్వామి, బృందం వారి భక్తి గేయాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

జూపాడుబంగ్లాలో 10.8 మిల్లీమీటర్ల వర్షం



మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపునీరు

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు వర్షం కురిసింది. పగిడ్యాల మండలంలో అత్యధికంగా 48.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కొత్తపల్లిలో అత్యల్పంగా 6.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. పాములపాడులో 32.2, మిడుతూరులో 23.2 నందికొట్కూరులో 18.0, జూపాడుబంగ్లాలో 10.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆయన తెలిపారు.

అహోబిలేసుని దర్శించుకున్న జిల్లా కలెక్టర్



ఆశీర్వచనాలు అందుకుంటున్న కలెక్టర్ దంపతులు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించి వేదాశీర్వచనాలు అందుకున్నారు.

పీజీ రెండో విడత ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

కర్నూలు కల్చరల్: ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీలు, అనుబంధ పీజీ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద రెండో విడత పీజీ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 4వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, వెబ్ కౌన్సెలింగ్‌కు ఫీజు చెల్లింపు, 5వ తేదీ వరకు అప్‌లోడెడ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 1 నుంచి 5వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడం, 6వ తేదీన వెబ్‌ఆప్షన్ల మార్పు, 8వ తేదీన సీట్ల కేటాయింపు, 8 నుంచి 11వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో రిపోర్టింగ్ చేయడం, 8వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని షెడ్యూల్‌లో ప్రకటించారు.

విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకొని సమాజ సేవలో ముందుండాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు బ్రదర్ అబ్దుల్ హఫీజ్ పేర్కొన్నారు. సోమవారం అంటికోట మసీదులో విద్యాసంస్కరణలు–అభివృద్ధి అన్న అంశంపై మేధావులు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికం వల్లే చాలా మంది విద్యకు దూరమవుతున్నారని, విద్యతో పాటు ఉపాధి ఆవశ్యకత, పాఠశాలల ఏర్పాటుపై ఉమ్మడి ప్రయత్నానికి అందరూ ముందుకు రావాలన్నారు. ప్రతి ఒక్కరు ఉత్తమ సమాజం నిర్మాణంలో పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అమీర్‌షాహిద్, అబ్దుల్‌సమ్మద్, అఫీజ్‌జమాన్, అబులైజ్, నబీరసూల్, న్యాయవాది ఖాద్రి, డాక్టర్ పుర్ఖాన్ నదీమ్, అక్తర్, ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మాతా.. పాహిమాం!

నందికొట్కూరు: దుర్గామాతను భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు. దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో అమ్మవార్లను పూజారులు దుర్గామాతగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నందికొట్కూరు శ్రీ చక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి, చౌడేశ్వరి దేవి ఆలయాల్లో నిర్వాహకులు అమ్మవార్లను దుర్గా దేవి రూపంలో అలంకరించి పూజించారు. మిడుతూరులోని వాసవీ కన్యకా అమ్మవారు కూడా దుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



నందికొట్కూరులోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో దుర్గా దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు



మిడుతూరులో దుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు



• జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని సరస్వతీ ఆలయం, తాటిపాడు వీరభద్రస్వామి ఆలయాల్లోని అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి రూపంలో ఉన్న అమ్మవారిని కొలిచిన వారికి సర్వపాపాలు తొలగి సుఖసంతోషాలు ప్రాప్తిస్తాయని అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, మురళిమోహన్ తెలిపారు.



← తాటిపాడులో దుర్గాదేవిరూపంలో అమ్మవారు

జూపాడుబంగ్లాలో దుర్గాదేవిగా సరస్వతీదేవి అమ్మవారు →

మండల పరిధిలోని కొలనుభారతి దేవి అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించుకుని దుర్గామాతా చల్లగా దీవించు తల్లి అంటూ వేడుకున్నారు. –కొత్తపల్లి



దుర్గాదేవి అలంకారంలో కొలనుభారతిదేవి



• బండి ఆత్మకూరు: మండల వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఓంకార క్షేత్రంలో కొలువైన ఉమా మహేశ్వరీ అమ్మవారు దుర్గా దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఓంకార సిద్ధేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు.

మహిషాసుర మర్దినిగా..



వెలుగోడు: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవీ ఆలయంలోని అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుష్మాండ బలి అపహరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



• పాములపాడు: మండల కేంద్రంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, కలశారాధన, ఆకు పూజ నిర్వహించారు. కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

శాకాంబరిగా..



పగిడ్యాల: మండలంలోని నెహ్రూ నగర్‌లో అమ్మవారిని శాకాంబరి(కూరగాయలతో)గా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లలిత సహస్ర నామ పారాయణం చేశారు. భక్తులకు అమ్మవారి ప్రసాదంగా కదంబకం పంపిణీ చేశారు.



• ఆత్మకూరు: పట్టణంలోని పలు ఆలయాల్లోని అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దినిగా, చౌడేశ్వరిమాత దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. శివాలయాలు, అంభాభవానీ, జంబులమ్మ ఆలయాల్లో పార్వతీమాత వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

మహానందిలో రుద్ర, చండీ హోమాలు

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానంది క్షేత్రంలో మంగళవారం శత, రుద్ర, చండీహోమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు, రుత్వికులు ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు చేశారు. ఆలయంలో కొలువైన కామేశ్వరీదేవి మూలమూర్తి మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులలు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు.

• కామేశ్వరీదేవి అమ్మవారు సిద్ధిధాత్రి దుర్గగా రావణవాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, పి.సుబ్బారెడ్డి, ఎం. నీలకంఠేశ్వరరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న పండితులు, రుత్వికులు





రామాపురంలో నీటి మునకకు గురైన వరి పంట

వరి..వర్షార్పణం!

బండి ఆత్మకూరు: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా ఉన్న వరి పైర్లు నీట మునిగాయి. ఎడతెరిపినివ్వని వానలకు ఇప్పటికే వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు పూర్తిగా వర్షపు నీటిలోనే ఉండిపోయాయి. సోమవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా రామాపురం గ్రామంలోని మద్దిలేరు, గుంతెన వాగు, అలుగు వంకలకు నీటి ప్రవాహం ఎక్కువై గ్రామంలో సుమారు 350 ఎకరాలు నీటిలో మునిగినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: వెంకటేశ్వర ఏజెన్సీ, జయరాం ఫర్టిలైజర్ యజమానులు అంటగట్టిన నాసిరకం మొక్కజొన్న విత్తనాలతో మోసపోయిన బిజినవేముల గ్రామ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. బాధిత రైతుల మొక్కజొన్న పంటలను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వెంకటేశ్వర ఏజెన్సీ, జయరాం ఫర్టిలైజర్ దుకాణాలు విక్రయించిన మొక్కజొన్న విత్తనాలు 12 మంది రైతుల పొలాల్లో పంట రాలేదన్నారు. పైరు ఏపుగా పెరిగినా కంకిలో విత్తనాలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఫర్టిలైజర్స్ దుకాణాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఎకరాకు రూ.70 వేల చొప్పున పరిహారం ఇప్పించాలని అధికారులను కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, వెంకటేశ్వర్లు, రైతులు హుసేన్‌మియ్యా, మాబాషా, శ్రీనివాసులు, శేఖర్, శివలింగం, జయరాం, సుంకన్న పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలి

పాములపాడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాములపాడు, చెలిమిళ్ల గ్రామాల పరిధిలోని దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్కాల, ఎర్ర గూడూరు, భానుముక్కల, మద్దూరు, వాడాలా గ్రామాల పరిధిలో కూడా పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంట చేతికందే సమయంలో వర్షాలు ముంచెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయినా ఇక్కడి ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల చంద్రారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మతుజావలి, మాజీ సర్పంచ్ బాలునాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ రామకోటి నాయక్, నాయకులు హుస్సేన్, శివలింగం, హిదాయతుల్లా పాల్గొన్నారు.



వర్షానికి దెబ్బతిన్న పంటలు పరిశీలిస్తున్న నాయకులు

మతిస్థిమితం లేని యువతి ఆత్మహత్య

కర్నూలు: స్థానిక బుధవారపేటలో నివాసముంటున్న దేవరపోగు సునీత (24) మతిస్థిమితం సరిగా లేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి రాముడు (బక్కన్న) కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కూతుర్లు సంతానం. రెండో కూతురైన సునీత కొన్నేళ్లుగా మానసిక వ్యాధితో బాధ పడుతోంది. వైద్యుల వద్ద చికిత్స చేయించినప్పటికీ నయం కాక కొంతకాలంగా ఇంటి దగ్గరే ఉంటోంది. మంగళవారం కుటుంబ సభ్యులంతా కూలీ పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో అడ్డపంచతో సీలింగ్‌కు ఉరి వేసుకుంది. మధ్యాహ్నం 1 గంట సమయంలో కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి ఉరికి వేలాడుతూ కనిపించడంతో ఇరుగుపొరుగు సాయంతో కిందకు దింపి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలిసిన వెంటనే మూడో పట్టణ పోలీసులు కుటుంబ సభ్యులను పిలిపించి విచారణ జరిపారు. మతిస్థిమితం లేకపోవడం వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కర్నూలు (అర్బన్): కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలోని నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గొర్రెల కాపరి ఎల్లరాముడు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, మృతిచెందిన గొర్రెలకు ఒక్కోదానికి రూ.20 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల సహకార సంఘం చైర్మన్ శ్రీనివాసులు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ పర్ల శేఖర్, సీపీఎం నాయకులు, కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కె.రంగస్వామి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్ల రాముడుకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారని, కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబం అనాథగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కురువ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దపాడు ధనుంజయ, కురువ కులస్తులు, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి రేషన్ కార్డుల పంపిణీ

బండి ఆత్మకూరు: నేటి నుంచి మండల వ్యాప్తంగా రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ క్యూఆర్ కార్డులను ఇంటి వద్దకే పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 45 రేషన్ షాప్‌ల పరిధిలో ఉన్న ప్రతి లబ్ధిదారుడికి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే కార్డులు పంపిణీ చేస్తామన్నారు.

ఓపీ సేవలు బహిష్కరణ

పగిడ్యాల: ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అనిల్‌కుమార్, క్రిష్ణమూర్తి ఓపీ సేవలను బహిష్కరించి నిరసన తెలిపారు. గత ఏడాది ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నేటి వరకు అమలు చేయకపోగా దానికి విరుద్ధంగా చర్యలు తీసుకోవడంతో అవుట్ పేషేంట్(ఓపీ) సేవలను బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు వారు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

పాములపాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం పేద, మధ్యతరగతి ప్రజలకు వరమని జీబీపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై మండలంలోని దుకాణదారులకు, ప్రజలకు అవగాహన వారు మంగళవారం అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపుపై కేంద్రం తీసుకున్న చర్యలను వివరిస్తూ, తగ్గింపు ధరల కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగాల గోపాలకృష్ణయ్య, పెంచిక పల్లె నాగలింగమయ్య, లోకేష్, రుద్రవరం కాంచానం వేణు, మల్లికార్జున, మక్బూల్, రుద్రవరం హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న లారీ

• ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన లారీ

మహానంది: నంద్యాల నుంచి మహానంది వెళ్లే మార్గంలో రాళ్లవాగు సమీపంలో వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బొల్లవరం గ్రామానికి చెందిన జమాల్ స్కూటర్‌పై నంద్యాల వెళ్తుండగా నంద్యాల వైపు నుంచి వస్తున్న ఓ లారీ స్కూటర్‌ను తప్పించబోయి అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. లారీ వెనుక భాగం స్కూటర్‌కు తగలడంతో జమాల్, లారీ చెట్టును ఢీకొనడంతో లారీ డ్రైవర్ గాయపడినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించారు.

బిట్‌కాయిన్ పేరుతో బురిడీ

కర్నూలు: బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మబలికి ఓ మహిళను సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు. స్థానిక గణేష్ నగర్‌లో నివాసముంటున్న ప్రసన్న రాణికి అపరిచితుడు ఫోన్ చేసి బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో ప్రసన్నరాణి స్పందించి అతడు చెప్పిన బ్యాంకు ఖాతాకు ఫోన్‌పే ద్వారా రూ.90 వేలు జమ చేసింది. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

డిజిటల్ బుక్ .. కార్యకర్తలకు అండ



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: డిజిటల్ బుక్ కార్యకర్తలకు అండగా ఉంటోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి డిజిటల్ బుక్ యాప్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. దాడులకు పాల్పడిన కూటమి నేతలతోపాటు వారికి వంతపాడిన అధికారుల వివరాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేధింపులకు పాల్పడిన వారిని చట్టప్రకారం శిక్షించేందుకు యాప్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి కార్యకర్త యాప్‌ను ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బాల ఎల్లయ్య, మారెన్న, నియోజకవర్గ బూత్‌కమిటీ అధ్యక్షుడు పి.నాగలక్ష్మీ రెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధక్షుడు రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ మండల జోనల్ సెక్రటరీ మునిరంగ, క్రిష్టియన్ మైనార్టీ మండల అధ్యక్షుడు పరశురాముడు, వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం మండల అధ్యక్షుడు వెంకటేష్, వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, వైస్ ఎంపీటీసీ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల మీద పడినా కనికరించలేదు

నందికొట్కూరు: దళితులకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలానికి రక్షణ కల్పించాలని తహసీల్దార్ కాళ్లమీద పడి వేడుకున్నా కనికరించకుండా కొలతలు వేయకుండా వెళ్లిపోయారని నాగటూరు గ్రామానికి చెందిన దళితుడు సగినేల వెంకటేశ్వర్లు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించారని, ఇదే విషయాన్ని తాము ఎన్నోసార్లు అధికారులకు విన్నవించగా సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు గ్రామానికి వచ్చి పరిశీలించారన్నారు. ఇలా చూసి అలా వెళ్లిపోతుండగా కొలతలు వేసి దళితులకు కేటాయించిన 2 ఎకరాల పొలాన్ని చూపించి హద్దులు ఏర్పాటు చేయాలని కాళ్లమీద పడది వేడుకున్నా నిర్లక్ష్యంగా వెళ్లిపోయారన్నారు. శ్మశాన వాటిక ఆక్రమణలకు గురికావడంతో మృతదేహాలను పూడ్చిపెట్టిన స్థలంలోనే మరో మృతదేహాన్ని పూడ్చాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటిక స్థలాన్ని కొలతలు వేసి హద్దులు చూపాలని లేకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామని దళితులు హెచ్చరించారు.



శ్మశాన వాటిక స్థలం చూపించాలని తహసీల్దార్ కాళ్లపై పడిన దళితుడు

సీనరేజ్ వసూలుకు రంగం సిద్ధం

• పలు చోట్ల మినీ కంటైనర్లు ఏర్పాటు
• దసరా తర్వాత ప్రైవేట్ సంస్థ చేతుల్లోకి..

కొలిమిగుండ్ల: పలు రకాల ఖనిజాల రవాణాకు సంబంధించి సీనరేజ్ వసూలు చేసే బాధ్యత ప్రైవేట్ సంస్థ చేతుల్లోకి వెళ్లిపోయింది. కొద్ది రోజుల క్రితం కూటమి ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సీనరేజ్ వసూళ్లకు టెండర్లు పిలవడంతో హైదరాబాద్‌కు చెందిన సుధాకర ఇన్‌ఫ్రా సంస్థ టెండర్ కైవసం చేసుకుంది. నాపరాతి గనులు, గ్రానైట్ తదితర ఖనిజాలను క్వారీల నుంచి ఎగుమతి చేసేందుకు ఇప్పటి వరకు భూగర్భ గనుల శాఖ అధికారులు రాయల్టీ వసూలు చేస్తూ వచ్చారు.

టెండర్ దక్కించుకున్న ప్రైవేట్ సంస్థ దసరా పండుగ తర్వాత సిబ్బందిని నియమించుకుని ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాల నుంచి సీనరేజ్ వసూలు చేసేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తోంది. సిబ్బంది ఉండేందుకు ఇప్పటికే బందార్లపల్లె క్రాస్ రోడ్డులో ఉన్న రాయల్టీ చెక్‌పోస్ట్ చెంతనే మినీ కంటైనర్ ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల మండల కేంద్రం, అవుకు మండలం రామాపురం, బనగానపల్లె మండలంలోని పలుకూరు క్రాస్ రోడ్డు సమీపంలో కంటైనర్‌లు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. బేతంచెర్ల రైల్వే గేట్ సమీపంలో ఇప్పటికే ఏర్పాటు చేశారు.



బందార్లపల్లె క్రాస్ రోడ్డులో రాయల్టీ చెక్‌పోస్టు వద్ద ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసిన మినీ కంటైనర్

గడ్డు పరిస్థితిలో పరిశ్రమ

అన్ని రకాల ఖనిజాల కంటే బనగానపల్లె నియోజకవర్గంలోని నాపరాయి చాలా తక్కువది. ఇప్పటికే ఈ పరిశ్రమ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. ఎగుమతులు లేక మైనింగ్ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సీనరేజ్ వసూలు ప్రైవేట్ పరం చేయడంతో యజమానులకు పాలుపోవడం లేదు. నాప, పాలీష్ రాళ్ల రవాణా చేసే సమయంలో టన్నుకు ఎంత మేర వసూలు చేస్తారనే విషయంలో ఆందోళన చెందుతున్నారు. టన్నుల ప్రకారం వసూలు చేస్తే కష్టాల్లో ఉన్న నాపరాతి పరిశ్రమ కోలుకోవడం కష్టంగా ఉంటుందని పలువురు యజమానులు పేర్కొన్నారు. వేలాది మంది కార్మికుల కుటుంబాలు ఈపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. ట్రాక్టర్లకు మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకోవాలని మైనింగ్ యజమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.